తెలుగు డిజిటల్ దినపత్రిక
# సిరి
...People Voice | www.siridaily.com
శుక్రవారం, జులై 4, 2025 | సంపుటి-1 సంచిక-204 పేజీలు- 13
The Largest Readers Local Digital Daily

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

- నాణ్యమైన భోజనం, విద్య అందిస్తున్నాం
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



7

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి
- హుస్నాబాద్ నుండి కొత్తపల్లికి నాలుగు లైన్ల రోడ్డు
- ఆయా శాఖల అధికారులు పర్మిషన్ లు ఇవ్వాలి
- టెండర్ విధానం పూర్తి చేయాలి
- నెలాఖరులోగా పనులు మొదలవ్వాలి
- సిద్దిపేట కలెక్టర్ హైమావతి

13



# సిగాచిలో శవాల వేట!

### అధికారుల కాళ్ళు మొక్కిన బాధితులు

- నాలుగు రోజులైనా శవాలను కూడా ఇస్తలేరు..
- మర్చిపోని ఘటనగా సిగాచి విధ్వంసం
- డీఎన్ఏ పరీక్షల ద్వారా పది శవాల గుర్తింపు
- ఇంకా ఆచూకి తేలని పది మంది శవాల గుట్టు

2,3 పేజీల్లో

కూటి కోసం.. కూలి కోసం పట్టణంలో బ్రతుకుదామని.. తల్లి మాటలు చెవిని పెట్టక బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం... ఎంత కష్టం.. అంటూ మహాకవి శ్రీశ్రీ వర్ణించిన విధంగా సిగాచి కంపెనీలో బతుకు తెల్లారిపోయిన వలస కూలీల కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి... బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జీవనం సాగిస్తున్న ఆ కుటుంబాలకు జీవనోపాధి కోల్పోయింది... చివరికి కన్నవాళ్ళను, తోబుట్టువులను, స్నేహితులను, తల్లిదండ్రులు గుర్తు పట్టలేనంతగా మాంసపు ముద్దగా మారిపోయారు... మరికొందరు ఎముకలు కూడా లభించకుండా బూడిదైనట్లు అర్థమవుతోంది... చివరికి ఆఖరి చూపు కూడా నోచుకోలేక తమవారి శవాలను ఇప్పించండని బాధిత కుటుంబాలు అధికారుల కాళ్ళు పట్టుకొని వేడుకుంటున్నారు.. గుండెలవిసేలా రోధిస్తున్నారు.. ఇంకా తమ వాళ్ళు డ్యూటీలో ఉన్నారనే భ్రమలోనే మగ్గుతున్నారు... కానీ వారికేం తెలుసుకు సిగాచి రూపంలో పిశాచి తమ పిల్లలను మింగేసిందని... కనీసం శవాలనైనా ఇప్పించండి సారూ... అంటూ బాధితులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టిస్తుంది.. సిగాచి ఘటనలో 40 మంది మృతి చెందగా 18 మంది మృతులను గుర్తించగా, తాజాగా మరో పది మందిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 12 మందితో పాటు ఆచూకి లేకుండా పోయిన పది మంది గుర్తింపు ప్రశ్నార్థకంగా మారుతోంది.. ఇంకా డీఎన్ఏ పరీక్షలతో పాటు శిథిలాల తొలగింపు కొనసా... గుతూనే ఉంది. నాలుగు రోజులవుతున్నా శవాల జాడ తెలియక పోవడంతో బాధితుల కన్నీరు తుడిచే నాథుడే కరువయ్యాడు..

(ప్రత్యేక ప్రతినిధి / పటాన్‌చెరు-సిరిన్యూస్)

## సిగాచి లో అధ్యయన కమిటీ విచారణ

- కంపెనీలో సేఫ్టీ అమలు చేశారా ?
- అనుమతులు... యంత్రాల భద్రతపై ఆరా
- పలు శాంపిల్స్ సేకరణ
- నెలరోజుల్లో పూర్తి నివేదిక అందించనున్న కమిటీ

## సిగాచి బాధితులకు వైద్య బిల్లుల షాక్!

- అల్లుడిని చూసి సొమ్మసిల్లిన మామకు వైద్య చికిత్సలు
- వైద్యానికి రూ. 70వేల బిల్లు చెల్లింపు
- పటాన్‌చెరు ధ్రువ ఆసుపత్రి నిర్వాకం
- న్యాయం చేయాలంటున్న బాధితులు





6

తండాకు బీటి రోడ్డు వేయాలని తండావాసుల వేడుకోలు

అభివృద్ధికి నోచుకోని ఆంభాజీ తండా

## బురద రోడ్లపై తండ్లాటే!

**రోడ్లు గిట్ల.. ప్రయాణమెట్ల**

- అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఆగమే
- చెరువులను తలపిస్తున్న రోడ్డు
- తరాలు మారిన మా తలరాత మారలే
- ప్రభుత్వాలు మారిన బతుకులు మారలే



## మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షమెప్పుడో?

4

- ఉన్న స్థలాన్ని పరిశ్రమలకు కేటాయింపు
- 109 సర్వే నంబర్లు స్టేడియానికి స్థలం కేటాయించండి

క్రీడా మైదానానికి స్థలం కరువు

# సిగాచిలో అధ్యయన కమిటీ విచారణ



- కంపెనీలో సేఫ్టీ అమలు చేశారా ?
- అనుమతులు...యంత్రాల భద్రతపై ఆరా
- పలు శాంపిల్స్ సేకరణ
- నెలరోజుల్లో పూర్తి నివేదిక అందించనున్న కమిటీ



(ప్రత్యేక ప్రతినిధి -సిరిన్యూస్) పాశమైలారం సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన భారీ పేలుడు ఘటనపై ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ సభ్యులు గురువారం విచారణ చేపట్టారు. భారీ పేలుడు ఘటనలో 40 మంది మృత్యువాత పడ్డారు. మరో పది మంది ఆచూకి లభించలేదు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యాక్టరీని సందర్శించి బాధితులను ఓదార్చి వారికి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అధికారుల తీరు, కంపెనీ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ప్రత్యేకంగా అధ్యయన కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే అధ్యయన కమిటీ రంగంలోకి దిగింది. కమిటీ చైర్మన్ వేంకటేశ్వర్‌రావు, సభ్యులు ప్రతాప్, సంతోష్, సూర్యనారాయణ బృందం గురువారం సిగాచి ఫ్యాక్టరీకి చేరుకుంది. మూడున్నర గంటలు ఘటన స్థలాన్ని కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రమాద సమయంలో అసలు ఎం జరిగింది అన్న దానిపై ఆరా తీశారు. పేలుడు తర్వాత సేఫ్టీ వాల్వ్ పని చేయలేదా అనేది నిపుణుల అనుమానం. అసలు పరిశ్రమలో తయారీకి తీసుకున్న అనుమతి ఏంటి ?త యారు చేస్తున్నదేంటి అన్న కోణంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది. పరిశ్రమ ఏర్పాటు చేసిన 30 ఏళ్ళలో ఇప్పటికి ఎన్నిసార్లు మిషనరీ మార్చారో తెలుసుకున్నారు. చివరిసారిగా పరిశ్రమలో సెఫ్టీ తనిఖీలు ఎప్పుడు చేశారు ? అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అన్న కోణంలోను విచారణ చేపట్టినట్లు సమాచారం. ఫ్యాక్టరీలో పేలుడు ఘటన వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణాలు ఏమిటో పరిశీలించారు. ఈ మేరకు పలు శాంపిళ్ళను సేకరించినట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సమగ్రమైన నివేదికను నెలరోజుల్లోగా ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిసింది.



# సిగాచి బాధితులకు వైద్య బిల్లుల షాక్!

- అల్లుడిని చూసి సొమ్మసిల్లిన మామకు వైద్య చికిత్సలు
- వైద్యానికి రూ.70వేల బిల్లు చెల్లింపు
- పటాన్‌చెరు ధ్రువ ఆసుపత్రి నిర్వాకం
- న్యాయం చేయాలంటున్న బాధితులు



**పటాన్‌చెరు, జూలై 3(సిరిన్యూస్):** సిగాచి కంపెనీ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అల్లుడిని చూడడానికి వచ్చిన మామకు పటాన్‌చెరు ధ్రువ ఆసుపత్రి షాకిచ్చింది. సిగాచి పరిశ్రమలో సీనియర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న మున్‌మున్ చౌదరి పేలుడులో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో అతని మామ బీరేందర్ చౌదరి బుధవారం రాత్రి ఆసుపత్రికి వచ్చాడు. మున్‌మున్ చౌదరిని చూడగానే ఒక్కసారిగా షాక్‌కు గురై సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో అదే ఆసుపత్రిలో బంధువులు చికిత్స చేయించారు. ఉదయం 3.30 గంటల సమయంలో అతన్ని ఆసుపత్రిలో చేర్పించగా 24 గంటలు గడవక ముందే ఆసుపత్రి యాజమాన్యం అతని కుటుంబ సభ్యుల వద్ద రూ.70వేల బిల్లు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. కేవలం చిన్నపాటి వైద్యానికి చికిత్స పేరుతో పెద్దమొత్తంలో బిల్లులు చెల్లించుకోవడం ఏంటని బాధితులు ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతపెద్ద దుర్ఘటనలో ఎందరో ప్రాణాలు కోల్పోయారని, గాయపడిన వారు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. మరోవైపు తన అల్లుడిని చూడడానికి వచ్చి ఆందోళన చెంది అస్వస్థతకు గురైతే ఆసుపత్రి యాజమాన్యం దోపిడీకి పాల్పడుతుందన్నారు. ప్రమాద బాధితులని కూడా చూడకుండా 24 గంటల్లోపే రూ.70వేల బిల్లు కట్టించుకోవడం దారుణమన్నారు. ఇలాంటి ఆసుపత్రులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకాశ్ డిమాండ్ చేశారు.

# ప్రమాదంపై కంపెనీ వివరణ

**పటాన్ చెరువు,, జూలై 3, (సిరి న్యూస్):** సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ లో జరిగిన అగ్ని ప్రమాదం పై కంపెనీ గురువారం సాయంత్రం తాజా ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, అత్యవసర బృందానికి, తెలంగాణలోని పాశమైలారంలోని తమ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం యొక్క వివిధ అంశాలను నిర్వహించడానికి ముందుకు వచ్చిన వారి ఉద్యోగులకు కంపెనీ కృతజ్ఞతలు తెలుపుతుందని అందులో పేర్కొంది. గాయపడిన 33 మంది బృంద సభ్యులలో 12 మందిని డిశ్చార్జ్ చేశారన్నారు. ఒక్కొక్కరికి తాత్కాలిక ఉపశమనంగా రూ.1 లక్ష అందించామని వివరించారు. జూలై 2, 2025 నాటి మునుపటి ప్రకటనలో, గాయపడిన ఉద్యోగులకు కంపెనీ పూర్తి వైద్య, పునరావాస సహాయాన్ని అందిస్తుం దని సిగాచి ఇండస్ట్రీస్ తెలియజేసింది. గతంలో నివేదించబడిన 40 మంది బృంద సభ్యుల సంఖ్యకు బదులుగా, మరణించిన వారి సంఖ్య 38 అని కంపెనీ ధృవీకరించింది. బాధిత కుటుంబాలకు భావోద్వేగ లాజిస్టికల్ మద్దతు అందించడానికి సిగాచి ఇండస్ట్రీస్ బృంద సభ్యులు ఆసుపత్రులలో 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఈ ప్రమాదం దాని అంతర్లీన కారణాలను సమీక్షించడానికి, దర్యాప్తు చేయడానికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో దర్యాప్తు కొనసాగుతోందని కంపెనీ ధృవీకరించింది. ప్రాథమిక దర్యాప్తులో 7 రోజుల్లోగా ఫలితాలు వెలువడే అవకాశం ఉందన్నారు. అందువల్ల దర్యాప్తు ముందుకు సాగకుండా ఉండటానికి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణంపై వ్యాఖ్యానించకుండా ఉంటుంది. "ప్రస్తుతానికి, ప్రమాదం రియాక్టర్ పేలుడు వల్ల జరగలేదని మా మునుపటి ప్రకటనకు మేము కట్టుబడి ఉన్నామన్నారని కంపెనీ ప్రకటన తెలిపింది. ఏవైనా ప్రశ్నలు సమాచారం కోసం ఎవరైనా తమ బృందాన్ని సంప్రదించ వచ్చని వారు కోరారు. ఇతర సందేహాలు ఉంటే ఈ క్రింది వారిని సంప్రదించాలని కంపెనీ ప్రకటన లో పేర్కొన్నారు. సుదర్శన్ దుండిగల్ 92463 71566, ఫరూక్ షేక్ 9594777764,



# సిగాచిలో శవాల వేట!




## అధికారుల కాళ్ళు మొక్కిన బాధితులు

- నాలుగు రోజులైనా శవాలను కూడా ఇస్తలేరు..
- మర్చిపోని ఘటనగా సిగాచి విధ్వంసం
- డీఎన్ఏ పరీక్షల ద్వారా పది శవాల గుర్తింపు
- ఇంకా ఆచూకి తేలని పది మంది శవాల గుట్టు



(ప్రత్యేక ప్రతినిధి / పటాన్‌చెరు-సిరిన్యూస్)

**కూటి కోసం.. కూలి కోసం పట్టణంలో బ్రతుకుదామని.. తల్లి మాటలు చెవిని పెట్టక బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం... ఎంత కష్టం.. అంటూ మహాకవి శ్రీశ్రీ వర్ణించిన విధంగా సిగాచి కంపెనీలో బతుకు తెల్లారిపోయిన వలస కూలీల కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి... బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జీవనం సాగిస్తున్న ఆ కుటుంబాలకు జీవనోపాధి కోల్పోయింది... చివరికి కన్నవాళ్ళను, తోబుట్టువులను, స్నేహితులను, తల్లిదండ్రులు గుర్తు పట్టలేనంతగా మాంసపు ముద్దగా మారిపోయారు... మరికొందరు ఎముకలు కూడా లభించకుండా బూడిదైనట్లు అర్థమవుతోంది... చివరికి ఆఖరి చూపు కూడా నోచుకోలేక తమవారి శవాలను ఇప్పించండని బాధిత కుటుంబాలు అధికారుల కాళ్ళు పట్టుకొని వేడుకుంటున్నారు.. గుండెలవిసేలా రోధిస్తున్నారు.. ఇంకా తమ వాళ్ళు డ్యూటీలో ఉన్నారనే భ్రమలోనే మగ్గుతున్నారు... కానీ వారికేం తెలుసుకు సిగాచి రూపంలో పిశాచి తమ పిల్లలను మింగేసిందని... కనీసం శవాలనైనా ఇప్పించండి సారూ... అంటూ బాధితులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టిస్తుంది.. సిగాచి ఘటనలో 40 మంది మృతి చెందగా 18 మంది మృతులను గుర్తించగా, తాజాగా మరో పది మందిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 12 మందితో పాటు ఆచూకి లేకుండా పోయిన పది మంది గుర్తింపు ప్రశ్నార్థకంగా మారుతోంది.. ఇంకా డీఎన్ఏ పరీక్షలతో పాటు శిథిలాల తొలగింపు కొనసా... గుతూనే ఉంది. నాలుగు రోజులవుతున్నా శవాల జాడ తెలియక పోవడంతో బాధితుల కన్నీరు తుడిచే నాథుడే కరువయ్యాడు..**

పాశమైలారంలోని సిగాచి రగిల్చిన చిచ్చు ఇంకా ఆరడం లేదు. ఫ్యాక్టరీలో భారీ పేలుడు ఘటనలో 40 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఇంకా పది మంది ఆచూకి లభించక పోవడంతో ఆ కుటుంబాల బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికి 28 మందిని గుర్తించి వారి బంధువులకు అప్పగించారు. ఇంకా మృతుల మాంసపు ముద్దలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీఎన్ఏ పరీక్షలు ఆలస్యమవుతున్నందున బంధువుల ఆక్రంధనలు మిన్నంటుతున్నాయి. ఫ్యాక్టరీ వద్ద, ఆసుపత్రులకు తిరుగుతూ తమవారి ఆచూకి తెలుస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు. గురువారం ఫ్యాక్టరీలో పేలుడు ఘటనపై ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ సభ్యులు వస్తున్నారని తెలుసుకొని అధికారులు బందోబస్తు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బంధువుల ఆక్రం ధనలు మిన్నంటాయి. కనిపించిన అధికారినల్లా కాళ్ళు పట్టుకొని తమవారి శవాలను ఇవ్వాలని వేడుకున్నారు. మరోవైపు శిథిలాల తొలగింపు కార్యక్రమం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. మరోవైపు మృతి చెందిన మిగతా శవాలను గుర్తించడంలో డీఎన్ఏ పరీక్షలు ఆలస్యమవుతున్నాయి. అంతేగాకుండా మరో పది మంది ఆచూకి విషయం ఇంకా



తేలలేదు. అసలు వారి మాంసం ముద్దలైనా దొరుకుతాయో లేదోనన్న అనుమానం కలుగుతోంది. శిథిలాల తొలగింపు వేగవంతం చేస్తున్నప్పటికీ ఇంకా పూర్తి కావడం లేదు.

### కాళ్ళు మొక్కినా కనికరించరా...

మా కొడుకు శవాన్ని ఇప్పించండి సారూ... అంటూ పటాన్చెరు మండలం బండ్లగూడ గ్రామానికి చెందిన జతిన్ తండ్రి రామదాస్ పోలీసుల కాళ్ళు పట్టుకొని వేడుకోవడం చూపరులకు ఉద్రేకానికి గురి చేసింది. ప్రమాదానికి రెండు రోజుల ముందే కంపెనీలో జతిన్ చేరాడు. ఉద్యోగంలో చేరాడన్న సంతోషం నిలవకముందే పేలుడు ఘటనలో మృతి చెందాడు. మూడు రోజులు గడుస్తున్నా అతని మృతదేహం దొరకకపోవడంతో కుటుంబీకులు పరిశ్రమ వద్దకు వచ్చి ఏడుస్తూ విలపించారు. ఎంతకీ అధికారులు స్పందించకపోవడంతో చెట్టుకు తలను బాదుకుని తీవ్రంగా గాయపడ్డాడు.



### కడసారి శవాన్ని చూపించండి...

కడసారి తన భర్త శవాన్ని చూపించాలని కంపెనీలో పనిచేస్తున్న తన భర్త చోటూలాల్ భార్య రోధిస్తూ తెలిపింది. కనీసం శవాన్నయినా కడసారి చూసేందుకు ఇప్పించండి అంటూ గుండెలవిసేలా రోధించింది. డీఎన్ఏ పరీక్ష తర్వాతనే అప్పగిస్తామని చెప్పడంతో రెండు రోజులుగా ఎదురుచూస్తున్నాం. పెద్ద దిక్కును కోల్పోయాం..మమ్మల్ని ఆదుకొని నా భర్త శవాన్ని ఇప్పించాలని ఆ ఇల్లాలు అధికారులను వేడుకుంది. అలాగే తన భర్త కంపెనీ ప్రమాదంలో మరణించాడో..ఏమయ్యాడో తెలియడం లేదు..నాలుగు రోజులవుతుంది..డీఎన్ఏ పరీక్షల పేర జాప్యం చేస్తున్నారు..తాను కూడా నర్సునేనని బాధితుడు లాల్‌సోన్ భార్య విలపిస్తూ వేడుకుంది. డీఎన్ఏ పరీక్షల పేరుతో అధికారులు పట్టించుకోవడం లేదు. తమవాళ్ళ శవాలను కూడా చూసుకోలేని దుస్థితి ఏర్పడిందని వాపోయింది.

### పది శవాల గుర్తింపు...

పేలుడు ఘటనలో మృతి చెందిన 40 మందిలో ఇప్పటికే 18 మంది కార్మికుల శవాలను వారి బంధువులకు అప్పగించారు. అయితే గురువారం మరో పది మంది శవాలకు డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించి వారి బంధువులకు అప్పగించినట్లు చెబుతున్నారు. దీంతో ఇప్పటి వరకు 28 మంది శవాలను గుర్తించడం జరిగింది. ఇంకా 12 మందికి డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయి. ఇలావుండగా ఆచూకి లభించని పది మంది కార్మికుల శవాలను ఇంకా వెలికి తీయలేదు. డీఎన్ఏ పరీక్షలు త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.







# మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షమెప్పుడో?

### క్రీడా మైదానానికి స్థలం కరువు

### ఉన్న స్థలాన్ని పరిశ్రమలకు కేటాయింపు

### 109 సర్వే నంబర్లు స్టేడియానికి స్థలం కేటాయించండి

అన్నీ ఉన్న అల్లుని నోట్లో శని అన్న చందంగా మారింది గుమ్మడిదల మండలంలోని క్రీడాకారుల పరిస్థితి. ఈ ప్రాంతంలో నిత్యం క్రికెట్, వాలీబాల్ ఆడే క్రీడాకారులకు క్రీడా మైదానం లేక తమ క్రీడా నైపుణ్యాన్ని కోల్పోతున్నారు. జిల్లాలో గుమ్మడిదల మండలంలో వాలీబాల్ క్రీడాకారులకు పెట్టింది పేరు. ఈ ప్రాంతానికి చెందిన కీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తెచ్చిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారు. క్రీడాకారులకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో వారు పడరాని పడుతున్నారు. అన్ని సౌకర్యాలు ఉంటే అంతర్జాతీయ స్థాయిలో రాణించే సత్తా ఉన్నా క్రీడాకారులు ఉన్నప్పటికీ క్రీడా మైదానాలు లేకపోవడం మూలాన క్రీడలకు దూరమైన పరిస్థితి ఏర్పడుతుందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-సిరి న్యూస్, గుమ్మడిదల

#### స్టేజి మీద మాటలకే మినీ స్టేడియాల ఏర్పాటు

మండలంలో క్రీడోత్సవాలు నిర్వహించిన సమయంలోనే ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు క్రీడల విషయమై గుర్తుకు వస్తుంది. ఆ సమయంలో క్రీడాకారుల, ప్రజల మెప్పు పొందేందుకు మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పుకునే నాయకులు ముందుకు వస్తున్నారు. కానీ ఎక్కడ అది అమలు జరగడం లేదు. పలు సందర్భాలలో నాయకులు మినీ స్టేడియం గురించి ప్రస్తావనకు తీసుకురావడం గాలికి వదిలేయడం తప్ప క్రీడాకారులకు మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయలేకపోతున్నారు.

#### 109 సర్వే నంబర్లు స్టేడియానికి స్థలం కేటాయించండి

పఠాన్ చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల మండలంలో గల 109 సర్వే నంబర్లు ప్రభుత్వం పరిశ్రమలకు స్థలం కేటాయింపు జరుగుతున్నది ఇక్కడ ఎంతోమంది క్రీడల పై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉన్నారు 109 సర్వే నెంబర్ లో మినీ స్టేడియానికి స్థలాన్ని కేటాయించినట్లయితే క్రీడాకారులకు ఎంతో సహకరించిన వారవుతారని క్రికెట్, వాలీబాల్ క్రీడాకారులు వేడుకుంటున్నారు.

#### ప్రాథమిక పాఠశాల క్రీడా మైదానమే దిక్కు

మండల కేంద్రమైన గుమ్మడిదలలోని ప్రాథమిక పాఠశాలతో పాటు గ్రామాలలో ఉన్న పాఠశాలలో ఉన్న చిన్నపాటి స్థలాలే క్రీడలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఉన్న స్థలంలో వాలీబాల్ కబడ్డీ వంటి క్రీడలను నిర్వహించుకుంటున్నారు. కేవలం పాఠశాల సమయం తర్వాత మాత్రమే ఆట పోటీలలో పాల్గొనవలసి ఉంటుంది. ఉద్యోగులు వ్యాపారస్తులు ఉదయం వేళలో వాకింగ్ చేసేందుకు స్థలం లేక ప్రధాన రహదారుల గుండా గ్రామంలోని రహదారుల గుండా నడుచుకుంటూ పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

#### నిర్మాణానికి కృషి చేయాలి

మినీ స్టేడియం నిర్మాణానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సీనియర్ జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు సాధు మచ్చేందర్ రెడ్డి. స్థలాన్ని ఏర్పాటు చేసి క్రీడాకారులకు ప్రోత్సహించి క్రీడల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారుని ప్రోత్సహించేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

#### క్రీడామైదానం లేక చాలా ఇబ్బందులు క్రీడాకారుడు రాజు



క్రీడా మైదానాలు లేకపోవడం మూలాన ప్రతిభ ఉన్న కనబరచలేని పరిస్థితి ఏర్పడుతుందని క్రీడాకారుడు రాజు అన్నారు. మినీ స్టేడియం నిర్మాణం ఏర్పాటు జరిగితే చాలామంది క్రీడాకారులకు క్రీడలలో వారి ప్రతిభను చూపించుకునే అవకాశం ఏర్పడుతుందని ఆయన కోరారు.

#### ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం పెద్దొల్ల విట్టల్ ముదిరాజ్



పారిశ్రామిక వాడ ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని వారిని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని గుమ్మడిదల గ్రామానికి చెందిన పెద్దోళ్ల విఠల్ ముదిరాజ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.



# రక్షణ లేని పశువుల ఆసుపత్రి

- శిథిలావస్థలో కూలుతున్న చెట్లు పగులుతున్న గోడలు..
- 50 సంవత్సరాల పశువుల ఆసుపత్రి
- పశువుల ఆరోగ్యం కాదు ఆస్పత్రికి వస్తే అనారోగ్యమే
- మండల కార్యాలయాలను పట్టించుకున్న నాయకులు కనీసం దయ చూపలేదు
- చికిత్స కేంద్రంపై కూలిన వృక్షం తప్పిన ప్రాణాపాయం
- అధికారులు స్పందించాలని కోరుతున్న రైతులు





**రామయంపేట్ జూలై 3 (సిరి న్యూస్)** రామాయంపేట రాజకీయ పట్టణమే కానీ అభివృద్ధికి ఆమడ దూరంలో కొనసాగుతున్నది 50 సంవత్సరాలు గా నిర్మించిన మండల ప్రజా పరిషత్ పురాతన బ్లాక్ ఆఫీస్ భవనాలను తొలగించి నూతనంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం నిర్మించిన నాయకులు పై అధికారులు శిథిలవస్తులో ఉన్న మూగజీవాల చికిత్స కేంద్రాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమని ప్రజలు అంటున్నారు నల్ల పోచమ్మ గుడి వెనుకకు ఆనుకొని ఉన్న రామాయంపేట పశువుల ఆసుపత్రి ఇప్పటివరకు కూడా ఎటువంటి మరమ్మత్తులకు కనీస అవసరాలకు నోచుకోకపోవడం విచారకరం ముందు భాగంలో శిథిలమైపోతున్న రెండు గదులు దానికి ఉన్న మెయిన్ గేటు అలాగే వదిలేసి వెనుక వైపు నుంచి చికిత్స కార్యక్రమాలు చేపడుతుండడంతో ఈ రెండు గదుల్లో అసాంఘిక కార్యకలాపాలు తాగుబోతులకు ఆలవాలంగా మారిందని స్థానికులు అంటున్నారు పశువులు మధ్యలో తగ్గిపోయిన చాలామంది రైతులు పాడి రైతులు గేదెలను ఆవులను పెంచుకుంటున్నారు అలాగే ఇంటిలో పెంచుకునే కుక్కలు చికిత్స కొరకు పశ్వాసుపత్రి ఎంతైనా అవసరం ఉంది విలువైన మందులు ఇంజక్షన్లు నిల్వ చేసుకోవడానికి ఉన్న ప్రధాన గది నాచు గోడల పగుళ్లు వర్షం పడితే రక్షణ లేదని వైద్యాధి కారులు వాపోతున్నారు ఉరిమి ఉరిమి మంగళం మీద పడ్డట్టు మంగళవారం రోజు రాత్రి ఆసుపత్రి ఆవరణలో ఉన్న పెద్ద చెట్టు వానకు విరుచుకు పడడంతో పశువులకు చికిత్స చేసే షెడ్డు పూర్తిగా కూలిపోవడం జరిగింది ఒకవేళ అది చికిత్స సమయంలో పడి ఉంటే డాక్టర్ తో పాటు రైతులు గేదలు కూడా మరణించేవని ప్రజలు అంటున్నారు ఇప్పటికైనా అధికారులు ఆరోగ్యకరమైన ఆసుపత్రిని అనారోగ్యకరంగా మార్ ఉన్న పరిస్థితులను గుర్తించి దానికి మరమ్మత్తులు కొత్త చెట్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు





# కుంట భూమి కబ్జా!

## రాత్రికిరాత్రే చదును పొలంగా మార్పు







**నార్సింగి, జులై 3 (సిరి న్యూస్):** కబ్జా కు కాదేదీ అనర్హం అన్నట్టుగా కొందరు స్వార్థ పరులు కుంటలను సైతం కబ్జా చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి మీర్జాపల్లి వెళ్ళే దారిలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 624 లో 5 ఎకరాల 14 గంటల విస్తీర్ణం లో బర్రెంకల కుంట ఉండగా ప్రస్తుతం కుంట దాదాపు పూర్తిగా కబ్జాకు గురయ్యింది. ప్రస్తుతం అక్కడి భూమి మార్కెట్ విలువ ఎకరాకు దాదాపు కోటి వరకు ఉంది, దీనితో రియల్టర్లు, కబ్జాకోరులు కుంట పై కన్నేశారు. రాత్రికి రాత్రే కుంటను పూడ్చేసి, అనుమానం కలగకుండా జేసిబి లతో చదును చేసి, పోలాలుగా చిత్రీకరిస్తున్నారు. కుంట కబ్జా విషయమై ఇరిగేషన్ శాఖ అధికారులకు ప్రశ్నించగా, కొద్ది సంవత్సరాల క్రితం జియో ట్రాకింగ్ ద్వారా కుంటలను గుర్తించి తమ శాఖ రికార్డులలో పొందు పరచామని, అక్కడక్కడ సాంకేతిక లోపాల కారణంగా కొన్ని కుంటలు తమ రికార్డుల్లోకి రాలేవని తెలిపారు. రికార్డులలో రాని వాటిలో బర్రెంకల కుంట ఒకటని, కుంట కబ్జా విషయం తమ దృష్టి వచ్చిందని అన్నారు. విషయం తెలిసిన అనంతరం కుంట క్షేత్ర స్థాయి పర్యటనలో కబ్జా విషయాన్ని గుర్తించామని అన్నారు. తమ రికార్డులలో లేకున్నా, కుంట కబ్జా విషయాన్ని స్థానిక తహశీల్దార్ షేక్ కరీం, ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ లకు తెలిపి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. కుంట కబ్జా పై స్థానిక తహశీల్దార్ షేక్ కరీం ను వివరణ కోరగా రెవెన్యూ రికార్డులో కుంట విస్తీర్ణం 5.14 ఎకరా గా నమోదు అయి ఉందని, దానిని ఇరిగేషన్ శాఖ కు బదిలీ చేయడానికి ఇరిగేషన్ శాఖ అధికారులకు బదిలీ కోరుతూ అధికారిక పత్రం సమర్పించాలని చెప్పామని, దాని పై కలెక్టర్ కార్యాలయం లో సంప్రదించి కుంటను ఇరిగేషన్ శాఖ పరిధిలోకి బదిలీ చేస్తామని అన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కబ్జాకోరుల పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు



# బురద రోడ్లపై తండ్లాటే!




**రోడ్లు గిట్ల.. ప్రయాణమెట్ల**

- అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఆగమే
- చెరువులను తలపిస్తున్న రోడ్డు
- తరాలు మారిన మా తలరాత మారలే
- ప్రభుత్వాలు మారిన బతుకులు మారలే

## తండాకు బీటి రోడ్డు వేయాలని తండావాసుల వేడుకోలు

## అభివృద్ధికి నోచుకోని ఆంభాజీ తండా

### ఈ తండాలో సుమారు 30కి పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి

రోడ్డు సౌకర్యం లేక తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వర్షాకాలం కావడంతో ముందే అతుకులు బ్రతుకులుగా ఉన్న రోడ్డు కాస్త బురదతో చెరువులు తలపిస్తున్నాయి దీంతో వారికి ప్రయాణం అంటేనే జరుగుతున్నారు తండా పుట్టి ఏళ్లు గడుస్తున్న బీటీ రోడ్డుకు నోచుకోలేమని వాపోతున్నారు అత్యవసర పరిస్థితిలో తండా నుండి సుమారు మూడు కిలోమీటర్లు మెయిన్ రోడ్ కు చేరుకోవాలంటే అరగోషాలు పడుతున్నారు ప్రభుత్వాలు మారినప్పటికీ మా తలరాతలు మారడం లేదని దిగులు చెందుతున్నారు. అత్యవసరమైతే తప్ప వారు తండా నుంచి బయటకు రావడం లేదు.

### తండాల ఆటోలు ఉన్న నడపలేని దుస్థితి

అంబాజీ తండాలో సుమారు నాలుగు ఆటోలు యువకులు జీవనోపాధి గురించి నడుపుతున్నారు కానీ రోడ్డు బాగా లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆటోలు నడుపుతున్నారు. కనీసం రోడ్డు బాగా అయితే కుటుంబంతో ఉండి దగ్గర్లో నడుపుకునే వెసులుబాటు ఉంటుందని అంటున్నారు.

### అత్యవసర సమయం వస్తే ఆగమే

తండాలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే మెయిన్ రోడ్డుకు చేరుకోవాలంటే కనీసం అర్ధగంట సమయం పడుతుందని ఇలా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే దుస్థితి ఏర్పడుతుందన్నారు. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర అవస్థలు పడుతూ వెళ్తున్నారు.



గతుకుల రోడ్లు రోడ్డంతా గుంతల మయం తేలిన కంకర రాళ్లు లోతైన గోతులు చినుకు పడితే చాలు రోడ్ అంతా చిత్తడి ఆ తండాకు రోడ్డు సౌకర్యం లేక నరకయాతన పడుతున్నారు. తాండ పుట్టిన నాటి నుండి ఏండ్లు గడుస్తున్న ఇంకా అదే రోడ్డు అదే నరక ప్రయాణం.. మా ప్రయాణ వెతలు తప్పవా అని అల్లాడిపోతున్నరు తండా వాసులు. తరాలు మారుతున్న తమ తలరాతలు మారటం లేదని వాపోతున్నారు ప్రభుత్వాలు మారిన మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోవట్లేదని తమ గోడును వెళ్ళబోసుకున్నారు అత్యవసర సమయం వస్తే మా జీవితాలు ఆగమే అని ఆధర్యపడుతున్నారు. రోజంతా కాయ కష్టం చేసి అవసరాల మీద బయటకు వెళ్దామంటే ప్రయాణం వారికి నరకంగా మారింది . ఇది మండల పరిధిలోని కంచనపల్లి గ్రామ పంచాయతీ పరిధి అంబాజీ తాండ దుస్థితి..

- కౌడిపల్లి (సిరి న్యూస్)

### బీటి రోడ్డు మంజూరు అయింది నెల రోజుల్లో పనులు ప్రారంభం భరత్ ఆర్అండ్ బీ ఏఈ

అంబాజీ తాండ కి బీటీ రోడ్డు మంజూరు అయింది. నెల రోజుల వ్యవధిలో పనులు ప్రారంభమవుతాయి. కాంట్రాక్టర్ మండలంలోని మరో గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణంలో ఉన్నందున ఆలస్యం జరిగింది నెల రోజుల వ్యవధిలో వెంటనే ప్రారంభించి బీటీ రోడ్డు పూర్తి చేస్తారు.





### మా రోడ్డు బాగు చేయండి సారు మూడవత్ మోత్య నాయక్ తండావాసి

వానాకాలం తండా నుంచి ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందని చదువుకునేందుకు వెళ్లే పిల్లలకు , వ్యవసాయ అవసరం గురించి ఎరువుల ,మందులు ఇతరత్రా తీసుకువచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని వెంటనే అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరారు.



### ఆటో ఉన్న బయటకు వెళ్లి నడిపిస్తున్న :మెగావత్ ప్రేమ్ రాజ్ నాయక్

జీవనోపాధి గురించి ఆటో తెచ్చుకున్నప్పటికీ మా తండాకి రోడ్డు బాగా లేకపోవడంతో లోకల్లో ఆటో నడపలేకపోతున్నానని, బయటకు వెళ్లి ఆటో నడుపుకునే పరిస్థితి ఏర్పడిందని బీటీ రోడ్డు అయితే కుటుంబంతో కలిసి ఉండి ఇక్కడే ఆటో నడుపుకుంటూ బ్రతకవచ్చు అన్నారు.



### కూరగాయలు అమ్ముకు రావలంటే ఇబ్బందిగా ఉంది: మేఘవత్ రాజమ్మ

ప్రతిరోజు కూరగాయలు తెంపి వీరి గ్రామాలకు వెళ్లి అమ్మకు రావాలంటే రోడ్డు బాగాలేక ఇబ్బంది పడుతున్నాం కూరగాయలు తెంపనికి అంతే సమయం రోడ్డు దాటాలంటే అంతే సమయం పడుతుంది రోడ్డు బాగా అయితే ఇంకాస్త ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు పండించి అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది.



# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

## గణిత టీచర్‌గా మారిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



- నాణ్యమైన భోజనం, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలతోనే సాధ్యం
- తరగతి గదిలలో విద్యార్థులకు పాఠాలు బోధించే సామర్థ్యాల పరిశీలన
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**పెద్ద శంకరంపేట జులై 3 (సిరి న్యూస్):** గురువారం పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి వసతులు విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశా రు. మెనూ ప్రకారం నాణ్యత, ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు. 9వ తరగతి విద్యార్థులతో గణిత టీచర్ గా మారి గణిత పాఠాలు బోధించారు. దాదాపు 30 నిమిషాల పాటు గణితం ను ఎలా నేర్చుకోవాలి? ఎలా ఒడిసి పట్టాలి అని మెలకువలు నేర్పిస్తూ గణితం లో ఉన్న సిద్ధాంతాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధిస్తూనే సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను చెప్పలేని సమాధానాలను స్వయంగా విద్యార్థులకు బోధించారు.విద్యార్థులలో మెరుగైన ఫలితా లు సాధించడానికి ప్రేరణను కలిగించారు. విద్యార్థులకు మంచి ప్రోత్సాహాన్ని, వారు కృషి చేయడానికి, ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంక్షేమ కోసం అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ యూనిఫామ్, టెస్ట్ బుక్స్ నోట్ బుక్స్ అందిస్తున్నామన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని విద్యార్థులు సంతృప్తితో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ పాఠశాల సందర్శన సందర్భంగా ప్రధానోపాధ్యాయులను పిలిపించి పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వసతులు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వనరులు, గత సంవత్సరం తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం తహసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో షాకీర్ ఆలి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు మెరుగైన వైద్యం అందాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**పెద్దశంకరంపేట్, జులై 3 (సిరి న్యూస్):** పెద్దశంకరంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. పీహెచ్ సీలోని హాజరు పట్టికను తెప్పించుకుని పరిశీలించారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్లు , అవుట్ పేషెంట్లు ఎంత మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెలుగు రోజుల్లో కూడా ప్రజారోగ్యంపై ఆసుపత్రిలో అందుబాటులో డాక్టర్లు సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాలని వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను రక్షించడానికి ప్రజారోగ్యం ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు..



## కౌడిపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

**కౌడిపల్లి జూలై 3 (సిరి న్యూస్):** మండల కేంద్రమైన కౌడిపల్లిలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ను మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. మొదటిసారి స్టేషన్ విజిట్ కి వచ్చిన ఎస్పీ శ్రీనివాసరావుకి ఎస్సై రంజిత్ రెడ్డి మొక్కను బహుకరించారు.. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

- ఉపాధ్యాయుల పనితీరు, విద్యాబోధనపై ప్రశంసల జల్లు
- పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ

**చిలిపిచెడ్ జులై 3 (సిరి న్యూస్):** చిలిపిచెడ్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలిపిచెడ్ , చిట్కుల్ గ్రామంలో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాల ,జూనియర్ కళాశాలను ఆకస్మికంగా జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ తనిఖీ చేశారు.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలిపిచెడ్ లో ఉపాధ్యాయుల హాజరు,పాఠ్యప్రణాళికలు, దినచర్య , తరగతి గది బోధన, విద్యార్థుల అభ్యాసన రికార్డులను పరిశీలించి తరగతి గదిలో ప్రత్యక్షంగా విద్యార్థులచే మాట్లాడి ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రగతిని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది.. జిల్లా విద్యాధికారి అడిగిన ప్రశ్నలకు విద్యార్థుల నుండి సరైన సమాధానాలు వచ్చినందుకు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించడం జరిగింది.. అదేవిధంగా మండలంలో నూతనంగా ప్రారంభమైన కస్తూరిబా జూనియర్ కళాశాలలో వసతి సౌకర్యాలు, బోధన సిబ్బందిని గురించి అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి విఠల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు..







# కురుస్తున్న వర్షాలతో జోరందుకున్న నాట్లు

- రైతులకు వ్యవసాయ అధికారిని పలు సూచనలు

**నార్సింగి, జులై 3 (సిరి న్యూస్) :** ఇటీవల కురుస్తున్న వర్షాల తో రైతుల మోములో సంతోషం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల పై హర్షం వ్యక్తం చేస్తూ, నాట్లు వేయడంలో మునిగి పోతున్నారు. వ్యవసాయ పొలాల్లో వర్షం నుంచి కాపాడుకోవడానికి రంగు కాగితాలు కప్పుకుని నాట్లు వేస్తున్న మహిళలతో పొలాలు రంగుల మయంగా దర్శనమిస్తున్నాయి. గత వానాకాలం లో మండల వ్యాప్తంగా 5720.01 ఎకరాలలో వరి పంటను వేయగా ఈ ఏడు వానాకాలం వరి పంట 5913 ఎకరాకు పెరుగుతుందని వ్యవసాయ శాఖ మండల అధికారులు అంచనా వేస్తున్నారు. నాట్లు వేసే సమయం కావడం తో మండల రైతులకు నార్సింగి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణ పలు సూచనలు చేశారు. వరి నారును 25-35 రోజులలో నాటాలని, ఎకరానికి 25 కిలోల దొడ్డు రకం, 20 కిలోల సన్న రకం విత్తనాలు సరిపోతాయని తెలిపారు. వరి నాట్లు వేసేటప్పుడు గాలి, వెలుతురు బాగా తగిలేలా, చదరపు మీటరు కు 33 కుదుళ్ళ చొప్పున నాటాలని, నాటేటప్పుడు మొక్కల మధ్య తగినంత దూరం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎరువులును నిపుణులు సూచించిన మోతాదు లోనే వాడాలని, మోతాదుకు మించి ఎరువులు వాడి అనవసరపు పెట్టుబడి ఖర్చులు పెంచు కోవద్దని అన్నారు. తెగుళ్ళు, పురుగుల నుండి పంటను రక్షించడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పంటను కోసేటప్పుడు విత్తనాలు పూర్తిగా ఎండిపోయిన అనంతరం కోయాలని అన్నారు. వరి సాగులో ఇతర ముఖ్యమైన అంశాల గురించి వివరిస్తూ వరి సాగుకు అనువైన భూములను ఎంచుకోవాలని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి తక్కువ పెట్టుబడి తో ఎక్కువ దిగుబడి సాధించుకోవాలని కోరారు. వరి లో కలుపు నివారణకు నీటి యాజమాన్యం చాలా ముఖ్యమని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, వరిలో తెగుళ్ళు, పురుగుల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పంట కోసిన తర్వాత విత్తనాలను నిల్వ చేసేప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, వరి పంటలో చీడపీడల నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులకు వ్యవసాయ పంటలకు సంభందించిన సలహాలు, సూచనల కోసం మండల కేంద్రంలోని రైతు వేదిక లోని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణ అన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



- సంస్థాగతంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి
- సూచించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**పెద్దశంకరంపేట్, జులై 3 (సిరిన్యూస్) :** తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడు రామచంద్ర రావు ను గురువారం హైదరాబాదులో పెద్ద శంకరంపేట మండల బిజెపి మాజీ అధ్యక్షుడు కోణం విఠల్ . నారాయణఖేడ్ మాజీ ఎమ్మె ల్యే విజయపాల్ రెడ్డి.. పేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ లు కలిసి పుష్ప గుచ్చం శాలువాలతో ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నారాయణఖేడ్ ప్రాం తంలో భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయిలో సంస్థాగ తంగా పార్టీ పరిషత్ కోసం కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని సూచించారు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు నాయకులు సమి ష్టిగా కలిసి పని చేయాలని పిలుపునిచ్చా రు... ఈ కార్యక్రమంలో పేట మండలం బిజెపి నాయకులు బుగుడాల కృష్ణ.. ఎర్ర శ్రీహరి.. భూషణం పాల్గొన్నారు..

### మెదక్ ఎంపీ రఘు నందన్ రావును పరామర్శించిన పేట మండల బీజేపీ నాయకులు

ఇటీవలే హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావును గురువారం పెద్ద శంకరంపేట మండలం బిజెపి పూర్వ అధ్యక్షుడు కోణం విఠల్.. బిజెపి మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ లు పరామర్శించారు.. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు బుగుడాల కృష్ణ.. ఎర్ర శ్రీహరి. భూషణం పాల్గొన్నారు.



# కమలాపురంలో వ్యక్తి దారుణ హత్య

**పెద్దశంకరంపేట జులై 3 (సిరి న్యూస్) :** పెద్ద శంకరంపేట పరిధిలోగల కమలాపురం గ్రామంలో వ్యక్తి దారుణ హత్య బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది గ్రామస్తులు పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మెదక్ జిల్లా పెద్ద శంకరపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన తోట సుధాకర్ 45సం. ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రించగా గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి తోట సుధాకర్ పై దాడి చేయడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయమే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి పేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి అల్లదురు ఎస్ఐ శంకర్ ఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితి సంరక్షించారు పోలీస్ జాగిలాలు క్లూస్ టీం తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు తోట మానెమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు మృతుడికి భార్య ఇటీవలే రెండు సంవత్సరాల క్రితం మరణించక ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.

# కరెంట్ షాక్ తో యువ గిరిజన రైతు మృతి



**కౌడిపల్లి జులై 3 (సిరి న్యూస్) :** కరెంట్ షాక్ తో యువ గిరిజన రైతు మృతి చెందిన సంఘటన కౌడిపల్లి మండలం కుకుట్లపల్లి శివారులో గురువారం ఉదయం చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పీర్యా తాండా పంచా యతీ పరిధి మాన్యా తండాకు చెందిన చెందిన పాత్లోత్ బన్సీలాల్ (35) వృత్తి వ్యవసాయం కాగా గురువారం ఉదయం పొలంలో మందు కొడతానని ఇంట్లో భార్య సుజాత కి చెప్పి కుకుట్ల పల్లి శివారులోని తన పొలం కు వెళ్లిన బన్సీలాల్ మందు పిచికారీ చేసేందుకు మోటారు ఆన్ చేయగా బోరు నడవకపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయిందని గమనించి పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు ఫీజు వైర్ వేసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. బన్సీలాల్ కు భార్య సుజాత ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు. తండాలో యువ రైతు మృతి చెందడంతో విషాదఛాయలు అమ్ముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి

- పంప్‌హౌస్‌లో మరమ్మత్తుల కారణంగా సరఫరాలో అంతరాయం
- ఏఈ స్వప్న విజ్ఞప్తి



**నార్సింగి, జులై 3 (సిరి న్యూస్) :** కొండపాకలోని పంప్ హౌస్ లో మరమ్మత్తుల కారణంగా మండలానికి నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ స్వప్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి హైదరాబాద్ కు వెళ్ళే (హెచ్ఎండబ్ల్యూఎస్) పైప్ లైన్ ద్వారా పాతుర్ జంక్షన్ వద్ద గల కోమటి బండ పంప్ హౌస్ కు నీటి సరఫరా జరుగుతుందని, పంప్ సెట్ల సామర్థ్యం తగ్గడం వల్ల నీటి సరఫరా లో అంతరాయం కలుగుతుందని, పంప్ సెట్ల మరమ్మత్తులకు 15 రోజుల వరకు సమయం పడుతుందని తెలిపారు. మరమ్మత్తుల కారణంగా డిమాండ్ కు సరిపడా నీటిని సరఫరా చేయలేక పోవడం తో, సరఫరా చేసిన నీటిని మండల ప్రజలు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రజలు ఈ విషయంలో సహకరించాలని ఏ ఈ స్వప్న విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు బహుమతులు ప్రదానం



**అల్లాదుర్గం, జులై 3 (సిరి న్యూస్) :** లైన్స్ క్లబ్ ఆఫ్ అల్లాదుర్గం శాఖ ఆధ్వర్యంలో గురువారం వివిధ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని చిల్వర్ జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాల తో పాటు అల్లాదుర్గం లోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు కొండమల్లప్ప, సెక్రెటరీ కంచరి బ్రహ్మం, కోశాధికారి రఘువీర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జైబాపూ జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**నార్సింగి, జులై 3 (సిరి న్యూస్):** హైదరాబాద్ లోని లాల్ బహదూర్ స్టేడియంలో ఏఐసిసి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ సభను విజయవంతం చేయడానికి పట్టణ కేంద్రంలోని రెడ్డి సంఘం లో జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమ మండల కో ఆర్డినేటర్ జూకంటి రాజా గౌడ్ అధ్యక్షతన మండల కాంగ్రెస్ నాయకుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ శుక్రవారం హైదరాబాదులో నిర్వహించే బహిరంగ సభకు కాం గ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరు అవుతారని తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు మండల, గ్రామ, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళా సంఘాలు, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరా వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిషర్ మెన్ మండల అధ్యక్షుడు సుధాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, టెలికాం బోర్డు మాజీ సభ్యుడు రాజేష్, మైనార్టీ నాయకులు షఫీ, జహీర్, పార్టీ నాయకులు బాచి స్వామి, కృష్ణ గౌడ్, ఆటోజానీ, మోతిలాల్, మైసయ్య, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

- మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



**నర్సాపూర్ జులై 3 (సిరి న్యూస్) :** హైదరాబాద్ లాల్ బహుదూర్ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మంత్రి వర్గం ఏఐసీసీ నాయకులు టీ పీ సీ సీ సీనియర్ నాయకులు పాల్గొంటారు.. మండలాల అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్టణ ,గ్రామ అధ్యక్షులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,యూత్ , పట్టణ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మా జీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు,వైస్ చైర్మన్లు కార్పొరేటర్లు మాజీ పట్టణ కౌన్సిలర్లు ఆయా మండలాల SC,ST, BC, మైనార్టీ సంఘాల అధ్యక్షు లు, సభ్యులు, మహిళా అధ్యక్షురాలు,NSUI సంఘం నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

**చేగుంట జులై 3 (సిరి న్యూస్) :** చేగుంట మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, నగదు రహిత, ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, జీవో 317 బాధితులందరికీ న్యాయం చేయాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పి ఆర్ సి ని ప్రకటించి వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాన్ని



వెంటనే చెల్లించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగెళ్లపల్లి కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షురాలు రేఖ,మండల ఉపాధ్యక్షులు మధునాల శ్రీనివాస్,సంగీత, అమరేశ్వరి, మండల కమిటీ సభ్యులు,రాధా, సరస్వతి, సునీత, మంజులత, సంధ్యారాణి, వీణ, సలీం, బంగారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి
- ఉద్యమకారుడి అంత్యక్రియలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



**రామాయంపేట జులై 3 (సిరిన్యూస్) :** రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కొత్తేనుగు లక్ష్మీనారాయణ కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండల కేంద్రం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం ఆయన స్వగ్రామం అక్కన్నపేటలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హాజరై అంత్యక్రియలో పాల్గొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఉద్యమకారున్ని కోల్పోవడం చాలా బాధాకరంగా ఉందని విచారం వ్యక్తం చేశారు.

# బీఎల్ఓ సూపర్వైజర్లకు ట్రైనింగ్

- నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి
- తహసీల్దార్ కమలాద్రి చారి



**శివంపేట్ జూలై 3 (సిరి న్యూస్):** శివంపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని 37 గ్రామపంచాయతీలోగల బి ఎల్ ఓ ,బి ఎల్ వో సూపర్వైజర్లకు ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి , తాసిల్దార్ కమలాద్రి చారి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు . స్థానిక సంస్థల ఎన్నికల ఏలాంటి పొరపాట్లు లేకుండా 18 సంవత్సరాల నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి శివంపేట ఎమ్మార్వో కమలాద్రి చారి బిఎల్ఓ లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ షఫీ, రెవెన్యూ సిబ్బంది, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# గురుపీఠంలో ప్రత్యేక పూజలు



**శివంపేట జులై 3 (సిరి న్యూస్) :** శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలోని గురు పీఠంలో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయ తనం మరియు శ్రీ శషిరిడి సాయిబాబా దేవాలయంలో మధ్యాహ్న హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు .జరిగిన పూజా కార్యక్ర మానికి అశేషమైన భక్తులు విచ్చేసి గురుదేవులు ఆశీస్సులు పొందారు. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్ద గోని జిన్నారం శివకుమార్ గౌడ్ వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు . ఈ సందర్భంగా, కొడకంచి సుదర్శన్ గౌడ్, శ్రీమతి ఝాన్సీ దంపతులు శ్రీ గురుపి ఠంలో జరిగే ప్రతి గురువారం అన్నప్రసాదంనకు సరిపోయే బియ్యాన్ని శాశ్వతంగా వారి అమ్మానాన్నల జ్ఞాపకార్థం అందిస్తున్నారు. ఈ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ కొడకంచి సుదర్శన్ గౌడ్ దంపతులకు, శ్రీ దత్తాత్రేయ మహాస్వామి గురుపరంపరుల మరియు శ్రీ పిరిడి సాయిబాబా యొక్క ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని వారికి ఆయురారోగ్యాలు కలిగి సుఖసంతోషాలు లభించాలని . ఆ గురుదేవులను కోరడం జరిగింది . ఈ కార్యక్రమంలో భక్తులకు పాల్గొన్నారు

# జోగిపేటలో లయన్స్‌క్లబ్ వార్షికోత్సవ కార్యక్రమం




**అందోల్ జూలై 3 (సిరి న్యూస్) :** నిస్వార్థంగా సేవలను అందించడమే లయన్స్‌క్లబ్ ఉద్దేశమని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జీఆర్. సూర్యరాజ్ అన్నారు. అందోలులోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో జరిగిన జోగిపేట లయన్స్‌క్లబ్ 50వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ 1917వ సంవత్సరంలో ఏర్పడిన లయన్స్ క్లబ్ నేటికి వందల సంఖ్యలో క్లబ్‌లను ఏర్పాటు చేసుకొని లక్షలాది మందికి సేవలను అందిస్తుందన్నారు. సేవకు చిహ్నం లయన్స్‌క్లబ్‌యని అన్నారు. జోగిపేట క్లబ్‌కు చరిత్ర ఉందన్నారు. 50 ఏళ్ళుగా క్లబ్‌ను కొనసాగించడం మూమూలు విషయం కాదని, డాక్టర్ రవీందర్‌గౌడ్ నేతృత్వంలో క్లబ్ ముందుకు సాగుతుందన్నారు. ఈ క్లబ్‌నుంచి గవర్నర్‌గా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. తాను కూడా తాను 1200 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నానని, లయన్స్‌క్లబ్‌లో చేరడం వల్లనే తనకు సేవ చేసే అలావాటు అయిందని, ఎవరైనా ఏది అడిగినా కాదనకుండా ఇప్పటికి అన్ని రకాలుగా సహకరిస్తున్నానన్నారు. మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లో ఎక్కువగా కంటికి సంబంధించిన శిబిరాలతోనే ముడిపడి ఉందని, లేనట్లయితే ఎంతో మందికి అంధులయ్యే అవకాశం ఉండేదన్నారు. తనకు కూడా వేలాది మందికి కంటి చూపు ప్రసాదించే అవకాశం లయన్స్‌క్లబ్ ద్వారానే లభించిందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఆపదలు వచ్చినప్పుడు ప్రభుత్వాల కంటే ముందుగానే లయన్స్‌క్లబ్ స్పందించి కోట్లాది రూపాయలు వెచ్చించిన సందర్భాలున్నాయన్నరు. జోగిపేట క్లబ్‌ను డాక్టర్ డీఎన్ రెడ్డి స్థాపించారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని తాము ముందుకు తీసుకుపోతున్నామన్నారు. నూతన కార్యవర్గం కూడా మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

### కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారం

జోగిపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాక్షులుగా జిఆర్.మధుసూదనరెడ్డి, డాక్టర్ జాన్‌పాల్, కార్యదర్శిగా జీ.సంతోష్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఎస్.మాణిక్‌రెడ్డి, కోశాధికారిగా ఎం. మల్లేశం, డైరెక్టర్‌లుగా ఎస్.నారాయణరెడ్డి, డాక్టర్ జి.జగదీశ్వర్, ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఎం.విజయ్‌కుమార్, డాక్టర్ దయానంద్, ఎస్.హరినారాయణ వర్మ, యశ్వంత్‌రెడ్డి, పీఆర్‌ఓ, మార్కెటింగ్ ఎం.పద్మనాభరెడ్డి, మెంబర్‌షిప్ చైర్మన్ ఎ.రాంబాబు, సర్వీస్ చైర్మన్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, క్లబ్ అద్వయిజర్లు డాక్టర్ అనంతరెడ్డి, యూత్ చైర్మన్ పి.శివశేఖర్, డయాబెటిక్ చైర్మన్ టి.రామకృష్ణ, విజన్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, హంగర్ చైర్మన్ విఠల్‌రావు తాండ్లేలతో పీడీజీ జీఆర్ సూర్యరాజ్ ప్రమాణస్వీకారం చేయించారు.




### కొత్త సభ్యుల ప్రమాణం

జోగిపేట క్లబ్ నూతన సభ్యులుగా డాక్టర్ వీరన్న, కొత్త శ్రీనివాస్, జి.మల్లయ్య, మధుసూదన్‌రెడ్డిలిచే మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ జనార్ధన్‌రెడ్డి ప్రమాణం చేయించారు. కొత్త సభ్యులుగా చేరిన వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎల్‌టీ కోఆర్డినేటర్ పద్మావతి, డైరెక్టరీ, డీఎస్‌ఐటీ ఆసుపల్లి శ్రీధర్, రీజియన్ చైర్మన్ అనితారెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ ఎ.రాంబాబు, జోన్ చైర్మన్ బుచ్చేశ్ యాదవ్, ప్రోగ్రాం చైర్మన్ నారాయణరెడ్డి, కో చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మాస్టర్ ఆఫ్ సెర్మనీ ఎస్.క్రిష్ణారెడ్డి, ఎస్.జగన్మోహన్‌రెడ్డిలతో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. జోగిపేట లయన్స్‌క్లబ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ గరవ్నర్ జీఆర్ సూర్యరాజ్‌మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ రవీందర్‌గౌడ్‌ను సన్మానించారు.

# పకడ్బందీగా శ్రావణమాసం ఏర్పాట్లు

- పాలక మండలి సమావేశంలో తీర్మాణం



**ఝరాసంగం జూలై 3 (సిరి న్యూస్) :** కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో వచ్చే శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేయాలని పాలక మండలి సమావేశంలో నిర్ణయించినట్లు చైర్మన్ చంద్రశేఖర్,ఆలయ కార్యిర్వహణాధికారి శివరుద్రప్ప తెలిపారు. గురువారం ఆలయ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మట్లాడారు. గత పది సంవత్సరాలుగా పూజ టికెట్ల ధరలు యథాస్తిథిలో ఉన్నాయని ధరలు పెంచడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. మొదటి గుండం పూజ 800 నుండి 1100 వందల రూపాయలు, గుండం పూజ 500 నుండి 800లు, అభిషేకం 200 నుండి 500లు, స్వామి వారి కళ్యాణం 1116నుండి 2500లు, అన్న పూజ 400 నుండి 500లు, కంట్లెం పూజ 400 నుండి 600లు, కారు పూజ 150 నుండి 200లు, మోటర్ సైకిల్ పూజ 50 నుండి 100 రూపాయలు పెంచనున్నట్లు వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వార అమలౌతున్న ప్రసాద్ పథకంలో కేతకీ ఆలయం చేర్చడానికి స్థానిక ఎంపీ ద్వారా సిఫారస్ చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. అలయ మాస్టర్ ప్లాన్‌కు కావలసిన భూమి సేకరణకు నిధుల సమీకరణ నిమిత్తం దేవాదాయ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ కమీషనర్‌కు లేఖలు రాయడమే కాకుండా ఆ దిశగా ప్రయత్నం చేయడానికి నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అధ్యక్షులు హన్మంత్‌రావు పాటీల్,పాలక మండలి సభ్యులు మల్లికార్జున్ ,బసయ్య స్వామి, కే.మల్లయ్య స్వామి, నవాజ్ రెడ్డి,ఈశ్వరప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గే బహిరంగ సభకు

# కలసికట్టుగా తరలివెళ్లాం

- మండల కోఆర్డినేటర్ మల్లారెడ్డి, అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్



**చేగుంట జులై 3 (సిరి న్యూస్) :** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పాల్గొనే బహిరంగ సభకు కార్యకర్తలు భారీగా తరలి వెళ్ళాలని చేగుంట కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి, మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ పిలుపునిచ్చారు.పట్టణ కేంద్రం లో ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి వివిధ గ్రామాల అధ్యక్షులు, వివిధ సంఘాల అధ్యక్షులు,సీనియర్ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులమంతా కలిసి కట్టుగా ఈ బహిరంగ సభకు తరలి వెళ్ళాలని బహిరంగ సభలో నాయకులు ఇచ్చిన సందేశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు.అందరం ఎవరికి వారు ఏర్పాట్లు, చేసుకున్నా అందరం కలిసి పట్టణ కేంద్రం నుండే తరలి వెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు మసాయి పెట్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ కొండి శ్రీనివాస్, ఎస్సి సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సిములు, యూత్ అధ్యక్షులు మోహన్ నాయక్, ఉపాధ్యక్షులు బోయిని శ్రీకాంత్, సినియర్ నాయకులు పూర్రా ఆగమయ్యా, అశోక్, నాగులు, రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

# వార్డు ప్రజల సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు



**సదాశివపేట, జూలై 3 (సిరి న్యూస్) :** సదాశివపేట పట్టణంలోని శ్రీ ఈశ్వర మార్కండేయ దేవస్థానం పాతకేరి 12వ వార్డు ప్రజలు ఎన్నో రోజులుగా కలలు కంటూ ఎదురు చూస్తున్నటువంటి బోరు బావిని ప్రజల కోరిక మేరకు మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల సహకారంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు చొరవతో 12వ వార్డు ప్రజలకు బోరు బావిని వేయించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ సంతోషాన్ని వక్త పరుస్తూ పులిమామిడి రాజుకు తమ వార్డు ప్రజలందరి తరపున కృతజ్ఞతలను తెలియపరిచారు. పి.ఎం.ఆర్ యువసేన నాయకులు తాలెల్మ రాము, రాగం అనిల్, సోమ శంకర్, షేర్‌అలీ మరియు వార్డు ప్రజలందరు కలిసి బోరు మోటర్ కు పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి తదనంతరం బోర్ మోటార్ ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు జయమ్మ, రాణి, స్వరూప, సరోజ, ఎండీ ఆజామ్, గాలెమ్మ సురేష్, వేణు, శివ మొదలగు వారు పాల్గొన్నారు.



శ్రీ వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా... పటాన్చెరువు పట్టణం లోని చైతన్య నగర్ లోని ఏడుగుళ్ళ పోచమ్మ ఆలయంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హోమం నిర్వహించి, ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. **పటాన్ చెరువు (సిరి న్యూస్) :**

# వేతనాలు అందక పస్తులు



- ఉద్యోగుల కుటుంబాలకు తప్పని వెతలు
- ఉద్యోగులపై కనికరం చూపుని ప్రభుత్వం
- పెండింగ్‌లోని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ (సిరి న్యూస్):** జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న 2 నెలల వేతనాలు విడుదల చేయాలని ఈరోజు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డి ఎం ఎం హెచ్ వో కార్యాలయంలో ఏవో శ్రీవాణికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం పరిధిలో పని చేస్తున్న అర్బన్ హెల్త్, ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీ, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గత 2 నెలల నుండి పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు ఉద్యోగులందరికీ 2 నెలల వేతనం పి.ఆర్.సి. ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు 2018లో 510 జీ.వో.లో నష్టపోయిన 4000 కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని నష్టపోయిన ఉద్యోగుల వారి ఎన్ హెచ్ ఎం. ఉద్యోగులు అర్బన్ హెల్త్ సెంటర్ లోపనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ మేనేజర్, అకౌంటెంట్, ఎం.ఎన్.ఓ, వాచ్ మెన్, స్వీపర్, బ్లాక్ లెవెల్ అకౌంటెంట్స్, బస్తీ దావఖన సపోర్టింగ్ స్టాఫ్, ఎస్.ఎన్. సి.యు. డాటా ఎంట్రీ ఆపరేటర్, డిస్ట్రిక్ ఎర్లీ ఎంట్రవెన్షన్ సెంటర్ లో డెంటల్ టెక్నీషియన్ సోషల్ వర్కర్, ఆర్.కే.ఎస్.కే. మరియు న్యూట్రిషన్ కౌన్సిలర్, ఎన్.సి.డి. కౌన్సిలర్, ఓ.టి. టెక్నీషియన్/ ఓ.టి అసిస్టెంట్, ఎస్.ఎన్.సి యు సపోర్టింగ్ స్టాఫ్, బ్లడ్ బ్యాంక్ లో డి.ఈ.ఓ, డ్రైవర్స్ టీ.-హబ్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండర్, పి.హెచ్.సి. డాటా ఎంట్రీ ఆపరేటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంటిజెంటీ వర్కర్స్, ఎన్.ఆర్.సి. సపోర్టింగ్ స్టాఫ్ , ఆయుష్ ఎస్.ఎన్.ఓ / ఎం.ఎన్.ఓ. , ఎం.సి. హెచ్. స్టాఫ్, ఫిజియోథెరపిస్ట్, ఎస్. టి. ఎల్.ఎ స్.టీ.బీ. ఆల్ క్యాడర్స్, లెప్రోసి ఆల్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్స్, అండ్ వీరందరికీ తక్కువ వేతనం వస్తున్నాయి వీరందరూ కూడా 510 జీవోలో మిస్ అయినవాళ్లు ఉద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగుల యొక్క బేసిక్ వేతనం అమలు చేయాలి, మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి, ప్రతినెల 1వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలి ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా ప్రక్షాళన చేసి రెగ్యులరైజ్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పర్మనెంట్ చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రాజు, కోశాధికారి ఇమ్రాన్, ఉపాధ్యక్షులు రాము, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

- మాజీ ఎంపీటీసీ జయశ్రీ శ్రీనివాస్



**సదాశివపేట, జూలై 3 (సిరిన్యూస్):** సదాశివపేట మండలంలోని నంది కంది గ్రామంలోని పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నంది కంది మాజీ ఎంపీటీసీ జయశ్రీ శ్రీనివాస్ సొంత ఖర్చులతో పాఠశాలల్లోని వంద మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ జయశ్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు పంపించడంలో తమకు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేయడం ద్వారా తమ మనసుకు ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ సమావేశం



**సదాశివపేట.జూలై 3 (సిరి న్యూస్):** వ్యవసాయ మార్కెట్ కమిటీ సదాశివపేట సాధారణ సమావేశం నిర్వహించడం జరిగింది. చైర్మన్ సడకుల కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధి పనుల కోసం రెండు కోట్ల 66 లక్షలు ఆమోదం కొరకు సమావేశంలో మార్కెటింగ్ అధికారి ఎండి రియాజ్ తో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దడువై అమాలి వాళ్లకు లైసెన్సులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పట్లోళ్ల శివకుమార్, బి.శైలేందర్ రెడ్డి, ఎం.మాణిక్ రెడ్డి, సయ్యద్యూ యూసుఫ, జి నరేందర్ గౌడ, వీ.కళావతి, సిహె. సోమ్లా కొమ్మ.రమేష్, కొత్త.లక్ష్మణ్ మరియు మార్కెటింగ్ అధికారి, సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## శిశుగృహాలో చట్టాలపై అవగాహన

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 3 (సిరి న్యూస్) :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధీకార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల ప్రకారం గురువారం శిశు గృహా, సఖి నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య తనికి నిర్వహించటం జరిగినది.. ఈ తనికి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య మాట్లాడుతూ పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలి అన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు.మంచి చదువులు చదివి ఉన్నత ఎదుగుదల ఎదగాలని అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు.

## సంగారెడ్డి డిపో నుండి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు

- సంగారెడ్డి, డిపో మేనేజర్, ఉపేందర్



**సంగారెడ్డి మున్సిపాలిటీ (సిరి న్యూస్) :** తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షిణ చేయాలనుకునే వస్తువులకు శుభవార్త. ఆషాడ పౌర్ణమి సందర్భంగా జులై 9న అరుణాచలంలో జరిగే గిరి ప్రదర్శనకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును టీజీఎస్ఆర్టిసి సంగారెడ్డి డిపో నుండి నడపాలని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. బస్సు సర్వీసు నెంబర్ 92233 గల ఈ బస్సు జులై 8న మధ్యాహ్నం 12 గంటలకు సంగారెడ్డి కొత్త బస్టాండు నుండి బయలుదేరి, ఆలంపూర్, జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం, సన్నిధికి వెళుతుంది. అక్కడ దర్శనానంతరం, జూలై 9 ఉదయం, ఆంధ్రప్రదేశ్ కాణిపాకం,లోని విగ్నేశ్వర దర్శనం, వేలూరు లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి, దర్శనం అనంతరం జులై 9వ తేదీ మధ్యాహ్నం, 3 గంటలకు, అరుణాచలం చేరుకుంటుంది. అరుణాచల ప్రదర్శన పూర్తి అయిన తర్వాత జూలై 10వ తేదీ 5,గంటలకు బయలుదేరి జూలై 11వ,తేదీ ఉదయం మహానంది దేవస్థానం దర్శించుకొని, అనంతరం సంగారెడ్డికి అదే రోజు సాయంత్రం 8 గంటలకు చేరుకుంటుంది. అరుణాచల గిరి ప్రదర్శనను టూర్ ప్యాకేజీగా టిఎస్ఆర్టిసి అందిస్తుందని, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ పేర్కొన్నారు. ఈ ప్యాకేజీ ధరను ఒక్కొక్కరికి, 4300, రూ, సంస్థ నిర్ణయించిందని ( అన్ని సెస్ చార్జీలు, బార్డర్ టాక్సీ టోల్ టాక్సీలు కలుపుకొని, ఐదు దేవస్థానములు టూర్ ప్యాకేజీగా అందిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీ సంస్థ అధికారిక వెబ్సైట్ tgsrtsbus, in లో సర్వీస్ నెంబరు 92233 లో ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు.

**అదేవిధంగా తేదీ 10625 ప్రత్యేక బస్సు ఉదయం :** 5 గంటలకు, కొత్త బస్టాండ్ నుండి బయలుదేరి కర్ణాటకలోని, గానుగాపూర్, రేజింతల్ విఘ్నేశ్వరుని దర్శించుకుని ఏర్పాటు చేయడం జరిగిందని డిపో మేనేజర్ పెడుతున్నారు. బోర్డర్ టాక్స్ టోల్ టాక్స్ కలుపుకొని 950, రూ, నిర్ణయించడం జరిగిందని ఇటు ఊరికి సంబంధించిన, పూర్తి వివరాలను, 9959226267, 9966907299,7382831375,:9398690602, ఫోన్ నంబర్లను, సంప్రదించవచ్చని డిపో మేనేజర్ పి. ఉపేందర్ సూచించారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- ఎంపీడీఓ సుధాకర్



**ఝరాసంగం జులై 3 (సిరి న్యూస్) :** నేటి సమాజంలో కాలుష్యం పెరిగిపోయి అనర్ధాలకు దారి తీస్తున్నాయని ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఝరాసంగం ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పేదరిక నిర్మూలనా సంస్థ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి మామిడి, జామ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలన్నారు. కాలుష్య రహిత సమాజాన్ని తయారు చేయడానికి మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం టిక్యానాయక్, సీసీలు మల్లేషం, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, నర్సమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, ఆపరేటర్ వేణు, వీఓఏలు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలకు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు విరాళం



**అందోల్ జులై 3 (సిరి న్యూస్) :** ఈనెల 15న జోగిపేట లో తూర్పుగౌని ముదిరాజ్ సంఘం ఆద్వర్యంలో బోనాల ఉత్సవాలకు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు రూ.లక్ష విరాళం జోగిపేట తూర్పు గౌని ముదిరాజ్ సంఘం ఆద్వర్యంలో ఈనెల 15వ తేదిన ఉజ్జయిని మహాంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించారు. గురువారం సంఘ భవనంలో జరిగిన సమావేశంలో తీర్మాణించారు. ఈ ఉత్సవాల నిర్వాహణకు పట్టణ 17వ వార్డు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. నిర్వాహణ బాద్యతలను రిటైర్డ్ ఉద్యోగి సంఘ నాయకులు తిమ్మిగారి పాండుకు అప్పగించారు. లక్ష రూపాయల విరాళాన్ని అందజేసిన చిట్టిబాబుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ కుల బంధువులు ఇంటికి ఒక బోనం తీయాలని నిర్ణయించారు. మహంకాళి అమ్మవారి ఊరేగింపు తూర్పు గౌనీ ముదిరాజ్ సంఘం నుండి పోచమ్మ గుడి వరకు జరుపబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జుట్టు విఠల్ ముదిరాజ్ సంఘ నాయకులు కొత్త శ్రీను ,కాళయ్య, నర్సింగ్ సాయిబాబా , జంగిలి వెంకటేశం , అంతం దానయ్య , అంతం శ్రీను , అరిగే వెంకటేశం ,అరిగే శ్రీరాములు దర్మేందర్, అయ్యప్ప సునీల్ , గట్టుకింది ఆంజనేయులు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సహకార శాఖ అధికారిని కలిసిన జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం సభ్యులు



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 3 (సిరి న్యూస్) :** సంగారెడ్డి జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం సభ్యులు జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘ ప్రతినిధులను టీజేఏసీ చైర్మన్ జిల్లా అధికారి ప్రత్యేకంగా అభినందించారు. సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షురాలు నిర్మల రాజకుమారి, కార్యదర్శి శ్రీధర్ ఇతర సభ్యులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని అధికారి సూచించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమం, పలు సమస్యల పరిష్కార అంశాలపై చర్చించారు జిల్లా సహకార శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కులుసౌకర్యాలపై అధికారులు అవగాహన వ్యక్తం చేశారు. సంఘం ద్వారా ఉద్యోగుల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన ప్రతినిధులు హామీ ఇచ్చారు. టీజేఏసీ చైర్మన్ జావిద్ అలీ మాట్లాడుతూ, ఉద్యోగ సంఘాల ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రభుత్వం అధికారులు ఉద్యోగుల వత్తిళ్లను పరిష్కరించేందుకు నిష్కృష్టంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన సంఘ ప్రతినిధులకు శాలువా కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోటి ఎన్జీవోస్ జిల్లా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

# అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 3 (సిరి న్యూస్):** హైదరాబాద్, ఫిల్మ్ నగర్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ యం.రాజేశ్వర్ గౌడ్, బుధవారం, రాత్రి బల్కంపేట ఎల్లమ్మ బోనాల బందోబస్తు ను ముగించుకొని తన కారులో ఇంటికి సంగారెడ్డి వస్తుండగా మార్గ మధ్యలో అనగా సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల చర్యాల x-రోడ్డు వద్ద బుధవారం అందాజ 1:30 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి, చికిత్స కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. యం.రాజేశ్వర్ గౌడ్ ఎస్ఐ 1990లో జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్ గా నియామకమై, ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో సాధారణ విధులతో పాటు స్టేషన్ రైటర్ గా విధులను నిర్వహించారు. అనంతరం జిల్లా టెక్నికల్,కంప్యూటర్ విభాగంలో సుమారు 15 సంవత్సరాలుగా ఐటి సెల్ ఇంచార్జ్ గా విధులను నిర్వహించారు. ఆయనకు భార్య గాయత్రి మరియు ఇద్దరు పిల్లల సంతానం కలదు. రాజేశ్వర్ గౌడ్, ఎస్ఐ జిల్లా పోలీసు శాఖలో అందించిన సేలను కొనియాడుతూ, ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్ల వేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డియస్పీ సత్యయ్య గౌడ్, ఆర్.ఐ రామరావ్, ఆర్మ్డ్ సిబ్బంది, ఐ.టి సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలలో ఉపాధి హామీ పనులను కొనసాగించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ పిలుపు





**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 3 (సిరి న్యూస్):** సంగారెడ్డి జిల్లాలో జిన్నారం మండల పరిధిలో 9 గ్రామాలు, పటాన్ చెరు మండల పరిధిలో 11 గ్రామాలు మొత్తంగా 20 గ్రామాలు జిన్నారం,పటాన్ చేరు మున్సిపల్ లలో విలీనం అవుతున్నాయి.ఈ గ్రామాలలో గత 20 సంవత్సరాల నుండి ఉపాధి హామీ పనులు నిర్వహిస్తూ 20 మంది ఫీల్డ్ అసిస్టెంట్ లు మరియు సీనియర్ మెట్లు జీవనం కొనసాగిస్తున్నారు. మున్సిపల్ లో ఉపాధి హామీ పనులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.వీరి వయస్సు పై పడడంతో ఇంకోచోట వీరికి పనులు దొరికే పరిస్థితి లేదు. జిన్నారం మండలంలో 9 గ్రామాలలో పని చేస్తున్న కూలీలతోపాటు వారి కుటుంబ సభ్యులు 7000 మంది ఉన్నారు. పటాన్ చేరు మండలంలో పనిచేస్తున్న కూలీలతో పాటు 8900 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు.మొత్తంగా 16000 మంది రోడ్డున పడేటువంటి పరిస్థితి ఉంది. ఉపాధి హామీ పనులు కోల్పోతున్నామని కూలీలు ఆవేదన చెందుతున్నారు. కేరళ ప్రభుత్వం మున్సిపల్ పట్టణాల్లో కూడా పనులు నిర్వహిస్తున్నది ఈ రాష్ట్రంలో కూడా కేరళ మాదిరిగా పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులను కల్పించాలి.కూలీలకు పనులు కల్పించి ఆదుకోవాలని రేపు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని ఉపాధి హామీ పనులను సాధించుకునే దాంట్లో ముందుండాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ పీఠం చిట్టి బాబుకి దక్కాలి



**అందోల్ జులై 3 (సిరి న్యూస్) :** పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జోగిపేట లో పార్టీనీ ఒంటి చేతితో ముందుకు నడిపించిన నాయకుడు చిట్టిబాబు.అని ఆత్మ కమిటీ డైరెక్టర్ తుడుం యాదయ్య అన్నారు. ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఉందంటే అది చిట్టి బాబు వల్లనే అని ఆత్మ కమిటీ డైరెక్టర్ తుడుం యాదయ్య అన్నారు . తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు చిట్టి బాబుకు ఎల్లవేళలా ఉంటాయని ఆత్మ కమిటీ డైరెక్టర్ అన్నారు. చిట్టిబాబు లేకపోతే అందోల్ జోగిపేటలో కాంగ్రెస్ జెండా ఎగిరేది కాదు పది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేకున్నా ఒకటే జెండా పట్టుకొని ప్రతి కార్యకర్తను తన భుజాల మీద మోసుకొని కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకున్నాడన్నారు. జోగిపేటలో చిట్టి బాబు అంటే కులమత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరిని సమానంగా చూసే వ్యక్తి చిట్టి బాబు అని అన్నారు.. చిట్టి బాబు అంటేనే కాంగ్రెస్ జెండా అని ఆత్మ కమిటీ డైరెక్టర్ తుడుం యాదయ్య అన్నారు. అంతేకాకుండా జోగిపేటలో కాంగ్రెస్ జెండా కట్టాలంటే ఎవరి తరం కాలేదు ఓన్లీ చిట్టి బాబు వాళ్ళనే అయిందని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన జూడో యాత్ర కూడా కార్యకర్తలతో పెద్ద ఎత్తుగా భారీగా ర్యాలీలో పాల్గొన్నారు , డ్వాక సంఘాలు, ముదిరాజ్ సంఘాలు, రజక సంఘం, దళిత సంఘాలు, మహిళలతో కూడా భారీ ఎత్తుగా ర్యాలీలో పాల్గొన్నారు. రాబోయే మున్సిపల్ ఎలక్షన్ లో తప్పకుండా మున్సిపల్ చైర్మన్ పీఠం చిట్టిబాబుకి దక్కాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు కూడా చిట్టి బాబుకి ఉంటాయని ఆత్మ కమిటీ డైరెక్టర్ తుడుం యాదయ్య తెలిపారు

# విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి





- విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట కలెక్టరేట్, జూలై 3 (సిరి న్యూస్) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు సమ కూర్చి, విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నుండి మంజూరైన నిధులను కళాశాలలకు పెయింటింగ్, టేబుల్స్, డ్యూయల్ డెస్క్, విండోస్ రిపేర్ చేయించుకోవాలని అధికారులకు తెలిపారు. ఇంజనీరింగ్ ఏజెన్సీ నిర్వహించే అన్ని పనులు నాణ్యత ప్రమాణా లు పాటించాలని తెలిపారు. అత్యవసర తాగునీటి వసతి,మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని,ఇంజనీరింగ్ ఏజెన్సీ కావలసిన వాటికి ఎస్టిమేట్ తయారు చెయ్యాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి కళాశాలకు రావడానికి బస్ సౌకర్యం కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ అర్టిసి అధికారులతో సమావేశం నిర్వహించి కావలసిన రూట్ల కు బస్ సౌకర్యం, కొన్ని కళాశాలలకు బస్ పరిధి పెంచేందుకు నోట్ తయారు చేసి,ఆయా రీజనల్ మేనేజర్ లెటర్ పెట్టాలని తెలిపారు. జూనియర్ కళాశాల మరియు అన్ని హాస్టల్ లలో అన్ని సౌకర్యాలు సమకూర్చి ఒక్క సీటు మిగలకుండా విద్యార్థులు చేరేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రిన్సిపల్స్, విద్యార్థుల పట్ల మానవీయ కోణం లో ఆలోచించాలని, గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్,కొన్ని కళాశాలలో రాత్రి వేళల్లో ఆకతాయిలు చేరి మద్యం తాగుతూ, కిటికీలు, డోర్, టాయిలెట్స్ ఇతరత్రా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని తెలపగా సీసీ కెమెరాల పిట్టింగ్ చేసుకోవాలని,పోలీస్ అధికారులకు లెటర్ పెట్టి, పికెటింగ్ ఏర్పాటు చేసి, విద్యార్థుల భద్రతలో రాజిపడవద్దని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ రవీందర్ రెడ్డి, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిబిసీడీవో నాగరాజమ్మ, డిఎస్సిడిఓ కవిత, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగంపెంచండి

- నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించండి
- జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట జిల్లా, జూలై 3 (సిరి న్యూస్) :** అభివృద్ధి పనుల్లో వేగం పెంచి,నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపైన ఆయా మండల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి నాలుగు వరసల రహదారి నిర్మాణం పనులు,ఆయా శాఖల అధికారులు,వేగంగా పర్మిషన్ లు ఇవ్వాలని,టెండర్ విధానం పూర్తి చేసి రోడ్లు ఇరువైపుల చెట్లు నరకడం, తొలగించడం ఈ నెల చివరకల్ల పూర్తి చేయాలని, రోడ్డు పనులు మొదలవ్వాలని, ప్రతి పని ఒక టైం ఫ్రేమ్ పెట్టుకుని పనిచేయాలని అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. జిల్లెల గడ్డ వద్ద శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల కు సంబంధించిన స్థల సేకరణ పూర్తి చేశామని,రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని అనుమతులు రాగానే ఇంజనీరింగ్ అధికారులకు అందిస్తామని తెలిపారు. కొత్తచెరువు బండ్ డెవలప్మెంట్ కోసం ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇవ్వాలని,రంగనాయక సాగర్ నుండి నీటిని అందించడం కోసం బస్వాపూర్, పోరెడ్డి పల్లి లో కాలువల భూసేకరణ ప్రక్రియ అవార్డ్ స్టేజ్ పూర్తయిందని తెలిపారు. హుస్నాబాద్ నుండి జనగాం వరకు నిర్మించే రోడ్డు నిర్మాణం ప్రపోజల్ స్టేజ్ లో ఉందనీ నాక్ సెంటర్ కోసం స్థల సేకరణ పూర్తయిందని తెలిపారు. హుస్నాబాద్ రింగ్ రోడ్డు ప్లానింగ్ చేసి మూలమలుపులు ఎక్కువగా లేకుండా వాహనదారులు సులభంగా వెళ్లేందుకు మ్యాపింగ్ చెయ్యాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. హుస్నాబాద్ లో అర్టిఎ యూనిట్ ఆఫీస్ కోసం ల్యాండ్ అందించామని ప్రపోజల్ స్టేజ్ ఉందని,డిగ్రీ కళాశాలలో పి జి కోర్సెస్ ఏం.కామ్ కోర్సు 60 సీట్లు మజూరైయ్యాయని, ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ అయిన ఇల్లు గ్రౌండింగ్ కలవాలని ఏంపిడిఓ, మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు.150 పడకల ఆసుపత్రి, కోహెడ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్యాంప్లెక్స్ నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్కు,ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సింగరాయకొండ ప్రాజెక్ట్ ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు అందించడం కోసం కాలువల భూ సేకరణ పనుల,స్పోర్ట్స్ స్టేడియం లో ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్, జిమ్ ప్రపోజల్ గూర్చి తదితర అభివృద్ధి కార్యక్రమాల గూర్చి అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రామ్మూర్తి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతులతో మరింత బాధ్యత



**సిద్దిపేట జిల్లా, జూలై 3 (సిరి న్యూస్) :** పదోన్నతులతో మరింత గుర్తింపు తో పాటు బాధ్యత పెరుగుతుందని పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందుతున్న వారిని పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు. ప్రమోషన్ పొందిన సిబ్బంది మర్యాద పూర్వకంగా పోలీస్ కమిషనర్ ని కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా,విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని, సీనియార్టీ ప్రకారం అందరికీ ప్రమోషన్స్ రావడం జరుగుతుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ రావడంతో ఆనందం వ్యక్తం చేసి..ఉన్నత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేయాలి



**సిద్దిపేట టౌన్, జూలై 3 (సిరి న్యూస్) :** పోలీసులు అంకితభావంతో పనిచేసి, ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏసిపి రవీందర్ రెడ్డి కోరారు. పట్టణంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ను సందర్శించిన ఆయన పోలీసులను ఉద్దేశించి వర్టికల్ వారీగా ఎవరెవరు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్టికల్ వారిగా సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని,రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని,సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు, వివిధ నేరాలలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, మల్లేశం,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.